క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రహరీ సమీపంలోని రహదారి వెంబడి పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించరూ..అనే కథనం సాక్షిలో ఆదివారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జీపీ సిబ్బందిచే సోమవారం పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. దీంతో ఆ ప్రాంత కాలనీవాసులు సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



దామెర: 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన కూనమల్ల సురేందర్, పసరగొండకు చెందిన దేవరాజు, కోగిల్వాయికి చెందిన దండిగం రాజు కుటుంబ సభ్యులను ఫొటో, వీడియోగ్రాఫర్లు పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర వీడియో, ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ద్వారా వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.లింగమూర్తి ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దామెర ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు రమేష్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

'రమేశ్'కు రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ అవార్డు



ఆత్మకూరు: మండలంలోని కటాక్షపూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కుడుతాల రమేశ్ రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ బహుమతి సాధించాడు. సోమవారం హైదరాబాద్‌లో సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సమాచారశాఖ కమిషనర్ హనుమంతరావు చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా రమేశ్‌ను పలువురు అభినందించారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఐనవోలు: అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండలంలోని పంథిని గ్రామంలోని కోళ్ల ఫారంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కాజీపేట రూరల్: హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన గీత కార్మికుడు జనగాని సదానందం గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కే క్రమంలో సదానందం జారిపడి మృతి చెందాడని తెలిపారు.

మాజీ ఎంపీటీసీ మృతి

హసన్‌పర్తి: బైరాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ ముల్కలపల్లి కుమారస్వామి మృతి చెందారు. వారం రోజుల క్రితం నాగారం సమీపంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో కుమారస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కుమారస్వామి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి నివాళులర్పించి, బాధితులకు సంతాపం తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ లేక ఇబ్బందులు

- బదిలీల్లోనూ భర్తీ కాని పోస్టు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ లేక ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అసలే సీజనల్ వ్యాధుల సమయం, దీనికి తోడు పీహెచ్‌సీకి వెళితే రోగనిర్ధారణ పరీక్షలు చేసే పరిస్థితి లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారంలో ఒక రోజు రోగుల నుంచి శాంపిల్స్ సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తారు. ఈ సేకరణ కూడా స్టాఫ్‌నర్సుతో చేయిస్తున్నారు. అత్యవసరం లేని వారు ఈవిధంగా పరీక్షలు చేసుకుంటున్నా అత్యవసర రోగులు మాత్రం ల్యాబ్ టెక్నీషియన్



ఆత్మకూరు పీహెచ్‌సీ భవనం

లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. హాస్పిటల్‌లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ రోగనిర్ధారణ సౌకర్యం లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జరిగిన వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో ఆత్మకూరు ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టును ఖాళీలో చూపించలేదని సమాచారం. అయితే కొత్త రిక్రూట్‌మెంట్‌లో భర్తీ చేయాలని ఇలా చేశారని తెలిసింది. ఏది ఏమైనా ప్రస్తుతం ల్యాబ్‌టెక్నీషియన్ ఖాళీని వెంటనే భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భర్తీకి చర్యలు తీసుకుంటాం



పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్ ఖాళీ భర్తీ గురించి ఉన్నతాధికారులకు తెలియచేశాను. త్వరలోనే పోస్టు భర్తీ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం - స్పందన, వైద్యాధికారి

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

దామెర : మండల కేంద్రంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం సుప్రభాత సూక్తోపనిషత్ పారాయణం, గ్రామానికి తోరణ బంధన, గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకధారణ, అఖండ ప్రజ్వలన, అగ్ని ప్రతిష్ఠ, బ్రహ్మగణ మండపారాధన, గణపతి హోమం, నైవేద్యం, పంచగవ్యప్రాశన, అంకురారోపణ, మండపారాధన, మండప హోమం, జలాధివాసం, తీర్థప్రసాదముల సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పూజలు, సమస్త దేవతా ఆరాధన, సర్వతోభద్ర మండల, ఉపమండప హవాహనం, పోచమ్మ తల్లి దేవతా అభిషేకాలు, మూర్తి హోమాలు, నైవేద్యం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

తాటికొండ రాజేందర్ మట్లాడుతూ 20న మంగళవారం విగ్రహాల ఊరేగింపు, 21న బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగిడి శ్రీధర్‌రెడ్డి, బిల్లా రమణారెడ్డి, ఎర్ర స్వప్నరెడ్డి, కమిటీ సభ్యులు తాటికొండ భద్రయ్య, శ్యామ్, అశోక్, భిక్షపతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు



కమలాపూర్ : యజ్ఞోపవీతధారణ చేస్తున్న పద్మశాలి కులస్తులు



శాయంపేట : గాయత్రి పూజలో పాల్గొన్న డైరెక్టర్లు

కమలాపూర్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలో పద్మశాలి కులసంఘం పట్టణశాఖ ఆధ్వర్యంలో సోమవారం జంధ్యాల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో ఉదయం యజ్ఞోపవీత ధారణ, హోమ పూజలు, రక్షాబంధన్ వేడుకలను వేద మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి స్థానిక విశ్వపతి ఆలయంతో పాటు సువర్చలా సహిత ఆంజనేయ స్వామి ఆలయం, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో పద్మశాలి కుల సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు బైరి దశరథం, ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు దాసి శంకరయ్య, చేరాల సారంగం, కమిటీ సభ్యులు, పద్మశాలి కుల బాంధవులు గాజుల సతీష్, పేరాల నర్సింహస్వామి, ఆడెపు సాంబయ్య, పులికంటి సమ్మయ్య, చేరాల వెంకట్రాజం, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని జంధ్యాల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మ బ్రాహ్మణులు చిందం కర్ణాకర్ గణపతి పూజ, గాయత్రి పూజ చేసి చేనేత కార్మికులకు పద్మశాలి కులస్తులకు సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, డైరెక్టర్లు రంగు ఆనందం, దాసరి సమ్మయ్య, దిడ్డి ప్రభాకర్, మేనేజర్ రాము, కార్మికులు పాల్గొన్నారు.మండల కేంద్రంలోని శ్రీ శివమార్కండేయ. శ్రీ వేంకటేశ్వర ఆలయ సముదాయాల్లో గాయత్రి హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్ నిర్వహించారు. మత్స్యగిరి స్వామి ఆలయంలో యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు బాసాని సూర్యప్రకాష్, సామల భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.

ఊరూరా రక్షాబంధన్

శాయంపేట : మండలంలో వివిధ గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పోకల కృష్ణమూర్తికి రక్షాబంధన్ పండుగ సెలవు ఇవ్వకపోవడంతో అతని సోదరి ముక్క సరస్వతి ఫోన్‌లో సమాచారం తెలుసుకొని మండలంలోని పెద్దకోడెపాక క్రాస్‌వద్ద సోదరుడు వచ్చే బస్సుకోసం నిరీక్షించి ఎట్టకేలకు బస్సులోనే సోదరుడికి రాఖీ కట్టి స్వీట్ తినిపించి తన ప్రేమను వ్యక్తపరిచింది. మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన సామాజిక సేవకుడు అమ్మ అశోక్ సోమవారం పొలం పనులు చేస్తుండగా పొలం గట్టుపైనే అతని ఆడపడుచులు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

దామెర: మండలంలోని దుర్గంపేట్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, ల్యాదెళ్లలో మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, కోగిల్వాయిలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, పసరగొండలో మాజీ ఎంపీటీసీ కళాసుధాకర్, ప్రజలు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు.

ఎల్కతుర్తి : రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకొని సోమవారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ప్రజలు ఘనంగా రాఖీ పండుగ నిర్వహించుకున్నారు. ఇంటి ఆడపడుచులు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లతో నోరుతీపి చేశారు. రాఖీ కట్టిన ఆడపడుచుకు సోదరులు కానుకలు సమర్పించుకొని వారి ఆశీస్సులు, దీవెనలు పొందారు.



శాయంపేట : పొలం గట్టు వద్ద అశోక్‌కు రాఖీ కడుతున్న సోదరి

కమలాపూర్ : చిన్నారులు సోదరులకు రాఖీలు కట్టి సోదర భావాన్ని పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల నుంచి ఆడపడుచులు తమ సోదరుల ఇళ్లకు రాకపోకలు సాగించగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

అంబేడ్కర్ విగ్రహానికి రాఖీ కట్టిన మహిళలు



ఎల్కతుర్తి : సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి

ఆత్మకూరు: మండలంలోని గుడెప్పాడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలు రాఖీలు కట్టారు. అంబేడ్కర్ పట్ల సోదరభావాన్ని ప్రకటించారు.

ఐనవోలు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ధర్మసమాజ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు సోమవారం రాఖీ కట్టారు. మహిళలు మాట్లాడుతూ స్త్రీలకు ఆస్తి, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆత్మగౌరవంతో జీవించే హక్కులు కల్పించిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అడగముందే రక్షణ కల్పించిన అంబేడ్కరే మాకు అన్నయ్య అంటూ నినదించారు. లక్ష్మి, మమత, రేణుక, శ్వేత, వెన్నెల, స్వప్న, మౌనిక, జోషిత, ప్రవీణ్, విష్ణు, వంశీ పాల్గొన్నారు.



దామెర : దుర్గంపేటలో..



ఆత్మకూరు : అంబేడ్కర్ విగ్రహానికి..



ఐనవోలులో..

మండలానికి విడదీయరాని అనుబంధం

శాయంపేట : కొండా దంపతులకు శాయంపేట మండలానికి విడదీయరాని అనుబంధం ఉందని మాజీ ఎంపీటీసీలు వినుకొండ శంకరాచారి, చింతల భాస్కర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఎంజేపీ పాఠశాలకు మంత్రి సురేఖ భూమిని విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా చక్రపాణి, చిందం రవి, సాధిక్, రవి, రవీందర్, సదానందం, కొమురయ్య, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



కేక్ తినిపించుకుంటున్న నాయకులు

విద్యుత్ మోటార్ దొంగల అరెస్ట్

శాయంపేట : వ్యవసాయ బావుల వద్ద బిగించిన విద్యుత్ మోటార్లను సాయిదత్త క్రషర్‌లో కాపర్‌వైరును దొంగిలించిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని జోగంపల్లి గ్రామ రైతులు పంట పొలాలకు సాగునీరు అందించడానికి కెనాల్‌లో విద్యుత్ మోటార్లను బిగించగా గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ఎత్తుకొని వెళ్లారు. మాందారిపేట గుట్టలలోని సాయిదత్త క్రషర్‌లో కాపర్‌వైరు దొంగతనం జరిగింది. ఈ రెండు ఘటనలపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగలను పట్టుకోవడానికి పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఆటోలో ఐదుగురు వ్యకులు వెళ్తుండగా పెట్రోలింగ్ వాహనాన్ని ఆపి ఆటోను వెనక్కి తిప్పుకొని పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించినట్లు తెలిపారు. ఆటోలో 4 ఎలక్ట్రికల్ మోటార్లు, 10 కిలోల కాపర్‌వైరు, ఇనుప సామాగ్రి ఉండడంతో వారిని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. పెద్దకోడెపాకకు చెందిన ఆటోడ్రైవర్ గోవిందు వెంకటేష్, మంద భద్రయ్య, పరకాల పట్టణం వెల్లంపల్లికి చెందిన కేదారి దుర్గభవాని, కుంభం అరుణ, కండెల లక్ష్మిలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

సీసీ కెమెరాలకు మరమ్మతు



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో రెండేళ్ల కిందట అమర్చిన సీసీ కెమెరాలు చెడిపోగా, మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు చేపట్టారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కోతులు, వర్షాల కారణంగా పని చేయకపోవడంతో పోలీసుల ఆధ్వర్యంలో సరిచేశారు.

అర్హులందరికీ రుణమాఫీ

సంగెం : అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) చాట్ల యాకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల ఖాతాల్లో మూడు విడతల్లో డబ్బు జమ అయినట్టు తెలిపారు. బ్యాంకు ఖాతాలు సరిగా లేని, కుటుంబ నిర్ధారణ జరగని, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైన, పట్టాపాసు పుస్తకాల నంబర్లు లేని, బ్యాంకు ఖాతాకు ఆధార్‌లో ఉన్న పేర్లు సరిపోలని, తదితర కారణాలతో కొందరు రైతులకు అర్హులైనప్పటికీ రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు రుణం పొందిన రైతులందరికీ జీఓ నంబర్ 567 ప్రకారం రుణమాఫీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈనెల 20వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విధ్వంసం, మోసాలకు పాల్పడలేదు



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ ఇర్ఫాత్

ఖిలా వరంగల్: ఈద్గా, మసీదు అభివృద్ధే లక్ష్యంగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ఎలాంటి విధ్వంసం, మోసాలకు పాల్పడలేదని ఖిలా వరంగల్ ఈద్గా మసీదు అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాత్, కోశాధికారి సయ్యద్ ఇబ్రహీం ఖలీల్, ప్రధాన సలహాదారు ఎం ఏ.జబ్బార్ తెలిపారు. ఈద్గా మసీదు బాధ్యులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, తమపై తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఈద్గా మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పలు ప్రాంత ముస్లిం పెద్దలు, ముస్లింలతో ఈద్గా, మసీదు కమిటీ ఎన్నిక కాగా, వక్ఫ్ బోర్డు నియామక పత్రాన్ని విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈద్గా స్థల పరిరక్షణ కోసం ప్రహరీ నిర్మించామని, ప్రార్థనలు, నమాజ్ కోసం ఏసీలు, సీసీ కెమెరాలు బిగించినట్లు వివరించారు. ఖబ్రస్తాన్‌లో మృతదేహాలను సమాధి చేసేందుకు వెళ్లిన వారి నుంచి అక్రమ వసూళ్లు పాల్పడుతున్న వ్యక్తిని ఇదేమిటని నిలదేస్తే తమపైనే అక్రమ కేసులు పెట్టినట్లు వారు ఆరోపించారు. కమిటీ ప్రతినిధులు ముఖ్తాం, హసన్ అలీబేగ్, మహబూబ్ జానీ, ఎండీ.అమ్జద్, ఎండీ.షౌకత్, గఫార్, అశ్రఫ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



కుక్కల బెడదను నివారించండి

మండలంలోని పీచరలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే గ్రామంలోని కొంతమందిని కుక్కలు దాడి చేసి గాయపర్చాయన్నారు. జీపీ అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. - వేలేరు

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రాజిరెడ్డి, పీచర, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 90009 39848

అత్యాచార నిందితులను శిక్షించాలి



హన్మకొండ: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



కేయూ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సంఘం బాధ్యులు, సమ్మయ్యనగర్ వాసులు

హన్మకొండ: సభ్యసమాజం తలదించుకునే విధంగా కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరారు. బాధిత కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, మద్దెల ఎల్లేష్, యేశబోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, కండె నర్సయ్య, సుదర్శన్, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో

కేయూ క్యాంపస్: కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సమ్మయ్యనగర్ మాల దాసరి సంఘం బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌లో సోమవారం రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో మాల దాసరి సంఘం నాయకులు దానబోయిన రాంబాబు, తౌటం గోపాల్, రావుల నరసింహ, రావుల వెంకన్న, కొవ్వాకుల రాములు, శేఖర్, తవుటం కుమార్, ఎల్లమ్మ, కంకణాల దుర్గమ్మ, రావుల కవిత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కాజీపేట రూరల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా కాజీపేట పట్టణంలో 62, 63, 64వ డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు టి.ఉప్పలయ్య మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటేశ్వర్, మండల కార్యదర్శి ఎర్ర నరేష్, సుశీల్, రవీందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం, హత్యను ఖండించండి

నయీంనగర్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానవీయ సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఆ ఘటనను ప్రతిఒక్కరు తీవ్రంగా ఖండిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సమతా కమిటీ కన్వీనర్ వెలిదండి సుమలత తెలిపారు.

దేవాలయాల్లో శ్రావణమాస పూజలు

మడికొండ: శ్రావణమాసం సందర్భంగా కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి అభిషేకం, అర్చనలు చేశారు. అలాగే, సీతారామచంద్ర స్వామి ఆలయంలో అభిషేకం అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పొరుపల్లి సత్యనారాయణ శర్మ, పరాశరం విష్ణువర్ధన చార్యులు, ధర్మకర్తలు దయాకర్, శ్రీనివాస్, కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామున కాశీవిశ్వేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు 9 కిలోల నెయ్యితో అభిషేకం చేశారు.

'హైడ్రా' వంటి ఏజెన్సీని ఏర్పాటు చేయాలి

హన్మకొండ: వరంగల్ నగరంలోని ఆక్రమణలను తొలగించడానికి ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా లాంటి ఒక స్వతంత్ర ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. హనుమకొండలో లేఖను సోమవారం విడుదల చేసి మాట్లాడారు. వర్షాలకు నగరంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు వరద నీటిలో మునిగిపోతున్నాయని, ఆక్రమణల వల్లనే ఈ దుస్థితి నెలకొందని శేషు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నగరంలో ఆక్రమణలను తొలగించడానికి, ఉల్లంఘనలపై చర్యలు చేపట్టడానికి, ఆస్తుల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో హైడ్రాకు రూ.200 కోట్లు కేటాయించిన విధంగానే వరంగల్ నగరాభివృద్ధికి కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక సహాయ నిధి కింద రూ.500 కోట్ల రూపాయలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.